## క్లుప్తంగా

### నేడు, రేపు పెద్దదేవుడు జాతర

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి గ్రామంలో ఆది, సోమవారాల్లో పెద్దదేవుడు జాతర నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 18న థింసా కార్యక్రమం, ఒడిశా నాటికలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి జాతరను విజయవంతం చేయాలని కోరారు.

### విద్యార్థినులకు స్వెట్టర్లు పంపిణీ


స్వెటర్లు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

కొయ్యూరు: రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ శనివారం రాజేంద్రపాలెంలోని ఆశ్రమ పాఠశాలలో బాలికలకు స్వెట్టర్లు, సబ్బులు, తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు సంబంధించి తన వంతు కృషి చేస్తున్నామన్నారు. అనాథ పిల్లలకు ఎలాంటి అవసరాలున్నా తీరుస్తామని తెలిపారు. ప్రతీ ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని కోరారు.

### సేవతోనే సంపూర్ణ ఆనందం


రగ్గులు పంపిణీ చేస్తున్న దాత రత్నంరాజు


అరకులోయ రూరల్: మండలంలో పద్మాపురం పంచాయతీకి చెందిన రత్నంరాజు తన తమ్ముడు రాజశేఖర్ శనివారం 800 మంది నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద గిరిజనులు చలికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. సుమారు 200 మందికి అందజేశామన్నారు. పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సేవతోనే సంపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు. సురేష్, బెహరా తదితరులు పాల్గొన్నారు.

### 300 మందికి వైద్య పరీక్షలు


బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

కొయ్యూరు: మండలంలోని వై.ఎన్.పాకలలో నాబార్డ్–రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. డౌనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వరప్రసాద్ శిబిరానికి వచ్చిన రోగులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆరోగ్య సూత్రాలను వివరించారు. శిబిరానికి వచ్చిన స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రాంకీ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ పి.హరికృష్ణ, సిబ్బంది కృష్ణ, సత్తిబాబు, ఏఎన్‌ఎంలు పుష్పవల్లి, తలుపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ పొదుపుపై కళాజాత


విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

అనంతగిరి: మండల కేంద్రంలోని శనివారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలోని వినియోగదారులకు బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ జేఈ రాజేష్, ఎల్ఐ రవి మాట్లాడుతూ విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. భవిష్యత్ తరాలకు విద్యుత్ సక్రమంగా అందాలంటే తప్పనిసరిగా ప్రస్తుత వినియోగదారులందరూ వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దీంతో రానున్న తరాలకు విద్యుత్ సమస్య ఉండదన్నారు. లైన్‌మెన్లు సురేష్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099
సాక్షి

# పేదల చెంతకే వైద్యం




నాడు గిరిజనులకు వైద్యం గగనంగా ఉండేది.. చిన్న ఆరోగ్య పరీక్షల నుంచి శస్త్రచికిత్సలు అందని ద్రాక్ష. టీడీపీ ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో కనీస సదుపాయాలు ఉండేవి కావు. వైద్యులు లేక మందులు లేక గిరిజనులు నానా అవస్థలు పట్టారు. గత్యంతరం లేక అప్పులు చేసుకొని ప్రైవేట్ వైద్యం చేయించుకునేవారు. అదంతా గతం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా వైద్యానికి పెద్దపీట వేశారు. ప్రజల చెంతకే వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల అభివృద్ధికి కోట్లాది రూపాయలను మంజూరు చేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకల సౌకర్యాలతో పాటు అధునాతన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫలితంగా సర్కారు ఆస్పత్రుల్లో కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన వైద్యం అందుతోంది. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




ఎటపాక: ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లో రోగాలొస్తే ఇక అంతే సంగతులు అనుకునే రోజులు మారాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. ప్రభుత్వ దవాఖానాలను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దారు. అన్ని వ్యాధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసేందుకు అధునాతన పరికరాలు సమకూర్చారు. పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎటపాక మండలంలో 21 గ్రామ పంచాయతీలకు మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. నెల్లిపాక, గౌరీదేవిపేట, లక్ష్మీపురం ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో 24 గంటలు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు. ప్రతీ పీహెచ్‌సీలో 172 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్‌లో బీపీ, సుగర్, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కామెర్లు ఇలా 20 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**మండలం: ఎటపాక**
**పీహెచ్‌సీలు: నెల్లిపాక, గౌరీదేవిపేట, లక్ష్మీపురం**

| | నెల్లిపాక | గౌరీదేవిపేట | లక్ష్మీపురం |
|---|---|---|---|
| సచివాలయాలు | 7 | 8 | 2 |
| సబ్ సెంటర్లు | 6 | 7 | 2 |
| గ్రామాలు | 45 | 56 | 21 |
| జనాభా | 21వేలు | 25వేలు | 7,685 |
| వైద్యులు | 2 | 2 | 2 |


నెల్లిపాక పీహెచ్‌సీ

**ఇంటింటికీ వైద్య సేవలు**

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ప్రతీ ఆస్పత్రి పరిధిలోని విలేజ్ క్లినిక్‌ల ద్వారా పేదల దరికి వైద్య సేవలను విస్తృత పరిచారు. పదిహేను రోజులకు ఒకసారి ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా రోగులకు డాక్టర్లు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రతీ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసి సుమారు 6వేల మందికి వైద్య సేవలందించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించేందుకు 108, గ్రామాల్లో వైద్య శిబిరాలకు 104, గర్భిణులు, బాలింతలను ఇళ్లకు చేర్చేందుకు, సరైన రహదారి సౌకర్యంలేని గ్రామాల నుంచి రోగులను తరలించేందుకు ఫీడర్ అంబులెన్స్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

**సౌకర్యాలతో నూతన భవనాలు**

దశాబ్దాల కాలంగా శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రి భవనాల్లో వైద్య సేవలు అందించడం తీవ్ర ఇబ్బందిగా మారింది. దీనిని అధిగమించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పూర్తి సౌకర్యాలతో నూతన భవనాలు నిర్మించారు. అందమైన చిత్రాలు, రంగులతో భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.ఆయా భవనాల్లో అన్ని విభాగాలకు ప్రత్యేక గదులు నిర్మించారు . రక్త పరీక్షలకు ల్యాబ్, కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు చేసేందుకు నియంత్రణ ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేశారు. ఇద్దరు డాక్టర్లకు, ఇతర సిబ్బందికి వసతి ఏర్పాటుతో పాటు రోగులకు బెడ్లు వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. ఒక్కో ఆస్పత్రి భవన నిర్మాణానికి సుమారు రూ.1.50 కోట్లు నిధులను ప్రభుత్వం వెచ్చిస్తోంది.

### వైద్య సేవలు బాగున్నాయి



గతం కంటె ఇప్పుడు ఆసుపత్రిలో వైద్య సేవలు బాగున్నాయి. మాబాబుకి కుక్క కరిస్తే ఇంజక్షన్ చేయించుకునేందుకు గౌరిదేవిపేట ఆస్పత్రికి వచ్చాను. ఊర్లో క్లీనిక్‌లో కూడా అన్ని వైద్య పరీక్షలు చేస్తున్నారు.

–గజ్జెల విజయ, తోటపల్లి

### వైద్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ



వైద్య రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.ఆస్పత్రుల్లో సిబ్బంది, మందుల కొరత లేదు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాము.

– డాక్టర్ దేవినాగు, గౌరిదేవిపేట పీహెచ్‌సి


రోగులకు మందులు ఇస్తున్న సిబ్బంది


రోగికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్


పీహెచ్‌సీలో అధునాతన సదుపాయాలు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీ


లక్ష్మీపురం పీహెచ్‌సీ

## ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు నిధులు

**అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ**


పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ప్రభుత్వ రంగాలకు సొంత భవనాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పెదపీట వేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలో పద్మాపురం మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న యండపల్లివలస సచివాలయం –2లో ఉపాధి హమీ పథకం, పంచాయతీ సాధారణ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ప్రభుత్వ శాఖలకు సొంత భవనాలు లేక అధికారులు, సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జోరందుకున్నాయని, అసంపూర్తిగా ఉన్న వాటిని కూడా పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం హెల్ప్‌లైన్ ట్రస్టు సమకూర్చిన రగ్గును గ్రామంలో సుమారు 1000 మందికి ఎమ్మెల్యే పాల్గుణ అందజేశారు. పేదలను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా సంస్థ సేవలను ఎమ్మెల్యే పాల్గుణ కొనియాడారు. గ్రామాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ సుస్మిత, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కుమారి, ముక్త, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్, పంచాయతీరాజ్ డిఈ రామమ్, నాయకులు సాంబ, యాసీన్, సుంక్ర, నర్సింగ్, ట్రస్ట్ నిర్వాహకులు బుజ్జిబాబు, సూరిబాబు, సురేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు


ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వై.రామవరం: స్థానిక బస్టాండు ఆవరణలోని లూథరన్ చర్చిలో శనివారం చర్చి వ్యవస్థాపకులు నక్కా నహూం, పాస్టర్ గాబ్రియల్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ పెద్ద షీలా గీతాంజలి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.క్రీస్తు బోధనలను అందరూ ఆచరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం విందు ఏర్పాటుచేశారు.

### మోదమ్మకు ప్రత్యేక పూజలు


పూజలు చేసిన కృష్ణ చరణ్‌నంద భారతిస్వామిజీ తదితరులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మ తల్లిని ఏలూరు జిల్లాలోని ముండురు యజ్ఞవల్క్య రాజాశ్రమానికి చెందిన కృష్ణ చరణ్‌నంద భారతిస్వామిజీ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామిజీకి ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ ప్రతినిధి వెంకటరత్నంలను ఘనంగా సన్మానించారు. ప్రసాదాలను పంపిణీ చేశారు.

## ప్రసాద్‌బాబు మృతికి సంతాపం


ప్రసాద్‌బాబు(ఫైల్)

సాక్షి,పాడేరు: చింతపల్లిలోని యూసీఐఎం ప్రార్థన మందిరం సీనియర్ దైవసేవకులు రెవరెండ్ కుంచే ప్రసాద్‌బాబు( 60) గుండెపోటుతో శనివారం మృతి చెందారు.ప్రసాద్‌బాబుకు చాతిలో నొప్పి రావడంతో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు కల్పించారు.పరిస్థితి విషమంగా ఉండడంతో ఉన్నత వైద్యసేవలకు గాను నర్సీపట్నం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతిచెందారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రాంతానికి చెందిన ప్రసాద్‌బాబు 1995 నుంచి చింతపల్లిలోని ప్రధాన యూసీఐఎం చర్చిలో దైవసేవకులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ కుటుంబాలు, తదితరులు ఆయన పార్థీవ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు.

### సమస్యల పరిష్కారానికి చర్యలు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్లను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శనివారం కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

### హక్కులు పరిరక్షించుకోవాలి

అరకులోయ రూరల్: గిరిజనుల హక్కులు పరిరక్షించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు చెప్పారు. మండల కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లి మండలంలో చేపట్టనున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు నిలుపుదల చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఓటు హక్కుపై అవగాహన

అనంతగిరి: ఎస్.ఆర్.పురం పంచాయతీ కేంద్రంలోని తహసీల్దార్ రాంబాయి ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. సర్పంచ్ సన్నమ్మ, డీటీ మాణిక్యం, ఆర్ఐ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

### పాలిథిన్ కవర్లు స్వాధీనం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని శనివారం వారపు సంతలో పాలిథిన్ కవర్లను అమ్మేందుకు వచ్చిన అనకాపల్లికి చెందిన ఇద్దరిని గిరిజన సంఘం నేతలు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పట్టుకున్నారు. పాలిథిన్ కవర్లను పంచాయతీ కార్యదర్శి గోపికి అప్పగించారు. దీంతో ఒక్కక్కరికి రూ.1500 చొప్పున ఇద్దరికి రూ.3వేల జరిమానా విధించారు. మరలా వారపు సంతలో పాలిథిన్ కవర్లు తీసువస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చారించి విడిచి పెట్టారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ప్రసన్న కుమార్, సమాచార హక్కు చట్టం మండల కమిటీ సభ్యుడు చిరంజీవి, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు గాసిరాం దొర పాల్గొన్నారు.

### 25 బోరుబావుల నిర్మాణాలకు చర్యలు


బోరుబావిని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డెటి మహేష్, నేతలు

సాక్షి, పాడేరు: అరకు ఎంపీ గొడ్డెటి మాధవి తన ఎంపీ నిధులతో చింతపల్లి మండలంలో 25 బోరు బావుల నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారు. దోమలగొంది, బెన్నవరం పంచాయతీ వట్టిభూముల వలస కాలనీలో నిర్మించిన బోరు బావులను వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డెటి మహేష్, సర్పంచ్‌లు చింతర్ల సునీల్, కిముడు సత్యనారాయణ, బెన్నవరం సచివాలయం కన్వీనర్ బొజ్జన్నదొర శనివారం ప్రారంభించారు.

### అన్ని వర్గాలకు సముచిత స్థానం


మాట్లాడుతున్న చిన్నారావు, తదితరులు

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శిగా నియమితుడైన చిక్కుడు చిన్నారావు (సుధీర్) శనివారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ పీవీటీజీ కోదు కులానికి చెందిన తనను గుర్తించి పార్టీలో సముచిత స్థానం కలిపించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాల్గుణకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంజరి పంచాయతీ కోంద్రూ గ్రామానికి చెందని తాను 2013లో పెదబయలు మావోయిస్టు దళంలో చేరి పనిచేస్తూ 2021లో విజయవాడ డిజిపి సమక్షంలో లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరానన్నారు. జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనకు ఆకర్షితుడై పార్టీలో చేరానన్నారు. జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, గణేష్, రాధ, నాయకుడు బేసు పాల్గొన్నారు.

### పథకాలపై ప్రచారం

ముంచంగిపుట్టు: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్స్యరావు అన్నారు. నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలన్నారు. లక్ష్మణ్, నారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


రాళ్లపుట్టు గ్రామంలో ఏపీకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి


పార్టీ జెండా ఆవిష్కరించిన ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ జ్యోతి

జి.మాడుగుల: పేదల అభ్యున్నతే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలో గడుతూరు పంచాయతీ రాళ్లపుట్టు గ్రామంలో శనివారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం సర్వోతోముఖాభివృద్ధి సాధించటానికి సీఎం జగన్ నవరత్నాలు వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందించన్నారు. జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమన్యాయం కల్పించారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి జగనన్న శక్తివంచన లేకుండా పనిచేస్తుంటే టీడీపీ తదితర పార్టీల నాయకులు ఆవాకులు, చవాకులు చెబుతున్నారని ఆమె మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకే మళ్లీ ఓట్లు వేసి సీఎంగా అధికారంలోనికి తీసుకురావాలని ఆమె కోరారు. అనంతరం గ్రామంలోని ఇటీవల తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకుంటుందన్నారు. సచివాలయ కన్వీనర్ చత్రపతి, నాయకులు మత్స్యకొండబాబు, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: జగనన్న ప్రభుత్వంతోనే అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ ఉషారాణి తెలిపారు. మండలంలో మాదగడ పంచాయతీ కేంద్రంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.సంక్షేమ పథకాల బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, సర్పంచ్ జ్యోతి, నాయకులు నర్సింగ్, బాలరాజు, రామ్మూర్తి, తిరుపతి, నగేష్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### సాబ్జీ సేవలు మరువలేనివి


సాబ్జీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

వై.రామవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ప్రమాదంలో మృతి చెందడంపై ఎంఈవో కె.తాతబ్బాయిదొర, యూటీఎఫ్ నేతలు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. యూటీఎఫ్ నేతలు లక్ష్మణరెడ్డి, వెంకటరమణ, నూకరాజు, గంగాధరరెడ్డి, రాజబాబు, చిన్నయ్య, హరితకుమారి, శిరీషరాణి పాల్గొన్నారు. ఎమ్మార్సీ ఏడుగురు కాంట్రాక్టు ఉద్యోగులకు స్థానిక యూటీఎఫ్ నాయకులు సుమారు రూ.50వేలు సాయమందించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో కె.తాతబ్బాయిదొర నగదు అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల నగదు, బియ్యం బస్తా పంపిణీ చేశారు.

## కళాశాలకు బీరువాల వితరణ


అందజేసిన బీరువాలతో కళాశాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అరకులోయ రూరల్: మండలంలో ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలకు అంజనాస్ ఫౌండేషన్ నిర్వాహకులు బచ్చ నవీన్ శనివారం కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ, వసతిగృహం వార్డెన్ విజయలకు ఐరన్ బీరవాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ తరఫున కాలేజీకి సామగ్రి అందజేశామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ చలపతిరావు, సిబ్బంది సునీల్‌కుమార్, గోపాలకృష్ణ, సంస్థ సిబ్బంది సతీష్, శరణ్య, సన్యాసిరావు, కార్తీక్ పాల్గొన్నారు.

### స్టవ్‌లు పంపిణీ

జి.మాడుగుల: మండల కేంద్రంలోని శనివారం జరిగిన కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సుందరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు అప్పలరాజు తదితరులు పీఎం ఉజ్వల యోజన ద్వారా లబ్ధిదారులకు మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను అందజేశారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపరింటెండెంట్ రామచంద్రరాజు, నేత మత్స్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com